గద్దర్ సినీ అవార్డుల వేడుకలో ముఖ్యమంత్రి

# తెలుగు సినీ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెడతాం




## వైభవంగా పురస్కారాల ప్రదానోత్సవం • 'జై తెలంగాణ' అన్న బాలకృష్ణ, అల్లు అర్జున్

**రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా కనిపించినా తెలుగు సినీరంగాన్ని అభిమానంతోనే చూసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సినీరంగం అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణంగా తోడ్పాటునందిస్తుందని భరోసానిచ్చారు. ప్రభుత్వం నడిపేటప్పుడు కొన్ని తీవ్ర నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, హైదరాబాద్‌లో తెలుగు సినీరంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తెలుగు సినీరంగంలో ప్రతిభావంతులకు పట్టం కడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం హైదరాబాద్ హైటెక్స్ ప్రాంగణంలో వైభవంగా జరిగింది. ప్రజాకవి, వాగ్గేయకారుడు గద్దర్ పేరిట ఏర్పాటు చేసిన ఈ సినీ పురస్కార ఉత్సవానికి తెలుగు తారాలోకం తరలివచ్చింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జ్యోతిప్రజ్వలనతో ఈ వేడుకను ఆరంభించారు. తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఈ వేడుక ఆసాంతం సందడిగా సాగింది. 2024 ఏడాదిగాను అన్ని విభాగాలకు, 2014-23 సంవత్సరాలకుగాను ఉత్తమ చిత్రాలకు ఈ అవార్డులను ప్రదానం చేశారు.**

'పుష్ప-2' చిత్రానికిగాను ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని స్వీకరించారు అల్లు అర్జున్. 'కల్కి' చిత్రానికిగాను ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్, '35 చిన్న కథకాదు' చిత్రానికి ఉత్తమ నటిగా నివేదా థామస్, 'రజాకార్' చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకుడిగా భీమ్స్ సిసిరోలియో పురస్కారాలను అందుకున్నారు. బాలకృష్ణ (ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు), మణిరత్నం (పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు), సుకుమార్ (బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు), అట్లూరి పూర్ణచంద్రరావు (నాగిరెడ్డి-చక్రపాణి ఫిల్మ్ అవార్డు), విజయ్ దేవరకొండ (కాంతారావు ఫిల్మ్ అవార్డు), యండమూరి వీరేంద్రనాథ్ (రఘుపతి వెంకయ్య అవార్డు) పురస్కారాలను అందుకున్నారు.

### అవార్డుల హైలైట్స్

- ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని స్వీకరించిన అనంతరం అల్లు అర్జున్ 'పుష్ప-2' చిత్రంలోని డైలాగ్ చెప్పారు. తన ప్రసంగం చివరలో 'జై తెలంగాణ' అనడంతో ప్రాంగణం హర్షాతిరేకాలతో మార్మోగిపోయింది. బాలకృష్ణ సైతం తన ప్రసంగం చివరలో 'జై తెలంగాణ' అంటూ నినదించారు.
- గాయకుడు రామ్ మిరియాల, సంగీత దర్శకుడు తమన్, గాయని మంగ్లీ వేదికపై తమ ఆటపాటలతో ఆహుతుల్ని అలరించారు.
- తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ'ను సంగీత దర్శకుడు కీరవాణి ఆలపించారు.
- గాయని మంగ్లీ ఆలపించిన బండెనక బండి కట్టి, తారలైనా చేరాలంటే, వేలవేల వెన్నెలలే నవ్వులుగా మారి, సారంగదరియా పాటలు ఆకట్టుకున్నాయి.



దేశం గర్వించదగ్గ గొప్ప కళాకారుడు గద్దరన్న. కళారంగంలో ఆయనది ఓ ప్రత్యేక స్థానం. ఒక దళిత కుటుంబంలో పుట్టి ఆయనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకన్న గొప్ప కళాకారుడాయన. ఆయన పేరిట సినీ అవార్డులందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే నా తండ్రి, నా గురువు, నా దైవం నందమూరి తారకరామారావుగారికి ఘన నివాళులర్పిస్తున్నా. అభివక్త ఆంధ్రరాష్ట్రంలో నంది అవార్డును స్థాపించడం జరిగింది. రాష్ట్రం రెండుగా మారాక, తెలంగాణ రాష్ట్రం, నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డును స్థాపించడం ముదావహం. ఇందులో భాగంగా నా తండ్రి నందమూరి తారకరామారావు పేరిట నెలకొల్పిన జాతీయ పురస్కారం నేనందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం గౌరవార్థకంగా అందించిన ఈ నగదు బహుమతిని మా బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌కి అందిస్తున్నా.' -బాలకృష్ణ



'తెలుగు సినీ కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ గద్దర్ ఫిల్మ్ అవార్డ్‌లను స్థాపించింది. ఈ తొలి అవార్డు వేడుకలో తొలి ఉత్తమ నటుడ్ని నేను కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవార్డు నాకిచ్చిన ప్రభుత్వానికి థాంక్స్. సుకుమార్‌గారి వల్లే నాకీ అవార్డు వచ్చింది. రాజమౌళిగారు ఈ సినిమాను హిందీలో విడుదల చేయమని చెప్పకపోతే 'పుష్ప' సిరీస్ ఈ స్థాయి వచ్చేది కాదు. 'పుష్ప2' చిత్ర యూనిట్‌కి కృతజ్ఞతలు. ఈ అవార్డును నా అభిమానులకు అంకితమిస్తున్నా -అల్లు అర్జున్

"

మనం ఎక్కడెక్కడ ఏం సాధించినా మన నేలమీద ఇలాంటి వేడుక జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చింది. నన్ను అవార్డుకు ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు - చంద్రబోస్

#### ఫిల్మ్ క్రిటిక్ అవార్డుకు మంత్రి సోదరుడు

గద్దర్ అవార్డుల ప్రకటన సందర్భంగా ఫిల్మ్ క్రిటిక్ కేటగిరీని ప్రస్తావించలేదు. ఫిల్మ్ క్రిటిక్ అవార్డుకు అర్హులు ఎవరూ లేరు కాబట్టి కేవలం పుస్తకానికి ఇస్తామని తెలిపారు. కానీ ఆశ్చర్యంగా అవార్డుల ప్రదానోత్సవానికి ఒకరోజు ముందు ఫిల్మ్ క్రిటిక్ అవార్డును పొన్నం రవిచంద్రకు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆయన స్వయాన మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు కావడంతో అవార్డుల ఎంపికలో ఎన్ని అవకతవకలు జరిగాయో అనే విమర్శలొచ్చాయి. సోషల్ మీడియాలో కూడా ఈ విషయంపై చర్చ జరుగుతున్నది.











గద్దరన్న పేరు మీద ఈ అవార్డులు మొదలుపెట్టి ఇండస్ట్రీని ఒక్క దగ్గరకు తీసుకురావడం ఆనందంగా ఉంది. మహబూబ్‌నగర్‌లో పుట్టిన పిల్లోడినైన నాకు కాంతారావు వంటి లెజెండరీ నటుడి పురస్కారాన్ని అందించడం, ఇది తీసుకున్న మొదటి వ్యక్తిని నేను కావడం నాపై మరింత బాధ్యత పెంచింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు -విజయ్ దేవరకొండ

### మా విజన్ డాక్యుమెంట్‌లో సినీరంగం-సీఎం

14ఏండ్ల క్రితం వరకూ జరిగిన ఈ అవార్డుల కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహించాలనే ప్రతిపాదనను సినీ పరిశ్రమ ప్రముఖులు, ముఖ్యంగా దిల్‌రాజు తమ దగ్గరకు తెచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో కొనసాగించిన ఒక మంచి సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగిస్తుందుకు ఆనందంగా ఉందన్నారు. కొన్ని కారణాల వల్ల ఆగిపోయిన అవార్డులను మళ్లీ పునరుద్ధరించాలనే సంకల్పంతో గద్దర్ ఫిల్మ్ అవార్డులకు శ్రీకారం చుట్టామని సీఎం వివరించారు. అవార్డుల ప్రదానోత్సవం అనంతరం ఆయన ప్రసంగించారు. హాలీవుడ్, బాలీవుడ్‌లకు ధీటుగా హైదరాబాద్‌లో సినీరంగాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీ సినీ పరిశ్రమకు ఎప్పుడూ అండగా నిలుస్తుంది. గతంలో భారతీయ సినిమా అంటే బాలీవుడ్ అనేవారు. తెలుగు సినిమా అంటే చెన్నయ్‌లో ఉంది అన్నట్లు మాట్లాడుకునేవారు. ఇప్పుడు భారతీయ సినిమా అంటే తెలుగు సినిమా అనే స్థాయికి వెళ్లింది. ఐటీ, ఫార్మసీతో పాటు ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా గొప్ప స్థాయికి చేరాలి. ఇదే మా సంకల్పం. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ గడ్డపైనే ఉండాలి. ఫిల్మ్ ఇండస్ట్రీని అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తాం. మేం క్రియేట్ చేయబోతున్న విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్‌ను సినీపరిశ్రమకు కేటాయిస్తున్నాం' అని సీఎం పేర్కొన్నారు.

### అవార్డుల మెమొంటోలకు 'గద్దర్' స్టిక్కర్

**'నమస్తే' కథనం, ప్రజావ్యతిరేకత భయంతో దిగొచ్చిన ప్రభుత్వం**

**ఆగమేఘాలపై గద్దర్ చిత్రాల అతికింపు**

హైదరాబాద్ జూన్ 14 (నమస్తేతెలంగాణ): గద్దర్ ఫిల్మ్ అవార్డుల జ్ఞాపికలకు గద్దర్ చిత్రంతో కూడిన డిజిటల్ స్టిక్కర్‌ను అతికించారు..శుక్రవారం 'నమస్తేతెలంగాణ' దినపత్రికలో గద్దర్‌కు తీవ్ర అవమానం పేరిట ప్రచురితమైన కథనం, ప్రజావ్యతిరేకత భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చింది. అఘమేఘాలపై గద్దర్ డిజిటల్ చిత్రాలను మెమొంటోలకు అతికించిందని తెలంగాణ కళాభిమానులు, సినీ ప్రముఖులు చెబుతున్నారు. అయితే అవసరమనుకున్నవారు ఈ స్టిక్కర్‌ను ఉంచుకునేలా అవసరం లేదనుకునేవారు తొలగించేలా వెసులుబాటు కల్పించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు వైఖరిని తెలంగాణకు చెందిన సాహితీవేత్తలు, సినీ ప్రముఖులు, ప్రతిపక్ష నాయకులు, కళాకారులు, రచయితలు తప్పుబడుతున్నారు. ఆంధ్రాప్రాంతానికి చెందిన సినీ పెద్దల లాబీయింగ్‌కు తలొగ్గి బి. నర్సింగరావు కమిటీ సూచనలకు విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శలు గుప్పిస్తున్నారు. గద్దర్‌పై ప్రేమతో కాకుండా కేవలం ప్రజల్లో పలుచనవుతామనే భయంతోనే ప్రభుత్వం ఆయన చిత్రాన్ని జ్ఞాపికలపై ఏర్పాటు చేసి పొరపాటును సరిదిద్దిందని చెబుతున్నారు.



## ఆ రుణం తీరేదెలా?

'ఆర్ఆర్ఆర్' తర్వాత పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన డైరీ నిండా పాన్ ఇండియా ప్రాజెక్టులే. బాలీవుడ్‌లో తారక్ నటించిన 'వార్ 2' పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా, ప్రశాంత్‌నీల్‌తో చేస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ ఏడాది ఆగస్ట్ 14న 'వార్ 2' విడుదల కానుండగా, వచ్చే ఏడాది ప్రశాంత్ నీల్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత 'జైలర్'ఫేం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్నారు తారక్. ప్రస్తుతం 'జైలర్2' పనుల్లో బిజీగా ఉన్న నెల్సన్, ఆ ప్రాజెక్ట్ తర్వాత ఎన్టీఆర్ సినిమా పని మొదలుపెడతారు. వచ్చే ఏడాది చివర్లో గానీ, 2027 సంక్రాంతికి కానీ ఈ సినిమా విడుదల ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. దీని తర్వాత త్రివిక్రమ్‌తో చేయబోయే మైథాలజీ మూవీ ఉంటుందని తారక్ సన్నిహితుల సమాచారం. అంటే ఈ సినిమా 2028 నాటి ముచ్చటన్నమాట. మరి ఇన్ని పానిండియా ప్రాజెక్టుల మధ్య 'దేవర 2' మాటేంటి? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. మరి ఈ రుణాన్ని తారక్ ఎలా తీర్చుకుంటారో చూడాలి.



## కథ వినగానే కన్నీళ్లొచ్చాయి!

'మ్యాడ్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును దక్కించుకుంది అనంతిక సనీల్‌కుమార్. ఈ భామకు నృత్యంతో పాటు బ్లాక్‌బెల్ట్‌లో కూడా ప్రవేశం ఉండటం విశేషం. ఆమె ప్రధాన పాత్రలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన '8వసంతాలు' చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం అనంతిక విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను శుద్ధి అయోగ్య అనే రచయిత పాత్రలో కనిపిస్తానని, తనకు మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం కూడా ఉంటుందని చెప్పింది. 'స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిది. ఓ అందమైన ప్రేమకథా చిత్రం చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ సినిమాతో కుదిరింది. ఈ కథ విన్నప్పుడే భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నా. నేను కోరుకున్న ప్రతీ అంశం ఈ కథలో ఉంది. ప్రేక్షకులకు ఓ జీవితాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ సినిమా కోసం నేను కళరి అనే ఫైట్ కూడా నేర్చుకున్నా' అని అనంతిక తెలిపింది. రాజకీయ నాయకురాలు కావాలన్నది తన ఆశయమని, అందుకే న్యాయ విద్యను అభ్యసిస్తున్నానని, అయితే తనకు 40 ఏళ్లు వచ్చాకే పాలిటిక్స్‌లోకి అడుగుపెడతానని నవ్వుతూ సమాధానమిచ్చిందీ భామ.



## మెగా ఫోన్ పట్టనున్న స్టార్ కమెడియన్

స్టార్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ మెగా ఫోన్ పట్టనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్(ట్విటర్)లో శనివారం ఉదయం ఆయన పోస్ట్ పెట్టారు. పైగా ఈ చిత్రాన్ని ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారట. ఈ మేరకు రాహుల్ రామకృష్ణ ప్రయత్నాలు కూడా మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తను దర్శకత్వం వహించనున్న తొలి చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక కూడా మొదలుపెట్టారాయన. 'దర్శకుడిగా తొలి ప్రయత్నం చేస్తున్నా. మీలో ఎవరికైనా ఇంట్రస్ట్ ఉంటే మీ షోరీల్స్, ఫొటోలను నాకు మెయిల్ చేయండి.' అని తన పోస్ట్‌లో రాహుల్ రామకృష్ణ పేర్కొన్నారు.

## చినుకు కురిసింది సిరిమువ్వగా..



నరేష్ ఆగస్త్య, రబియా ఖాతూన్ జంటగా నటిస్తున్న చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకుడు. ఉమాదేవి కోట నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'సౌండ్ ఆఫ్ లవ్' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. జస్టిన్ ప్రభాకరన్ స్వరపరచిన ఈ పాటను రెహమాన్ రచించారు. సహజసిద్ధమైన శబ్దాలతో ఈ పాటను కంపోజ్ చేసిన విధానం ఆకట్టుకునేలా ఉంది. 'ఒక మెరుపు మెరిసిందిపుడే చిరునవ్వుగా, ఒక చినుకు కురిసిందిపుడే సిరిమువ్వగా..' అంటూ చక్కటి భావాలతో సాగిందీ గీతం. కవితాత్మకంగా సాగే ప్రేమకథా చిత్రమిదని, కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. రాధికా శరత్‌కుమార్, తనికెళ్ల భరణి, వెంకటేష్ కాకుమాను, విద్యుల్లేఖ సుమన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, రచన-దర్శకత్వం: విపిన్.







Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.